


కథాప్రభ

# ప్రతిపాకం

'శ్రీవిరించి'

**రైలు ఎక్కి తన సీట్లో కూర్చున్న తరువాత స్తిమితపడింది అరవింద. 'అమ్మయ్య' అనుకుంది. మొత్తంమీద ఈ ప్రయాణం అంతా హడావుడిగా జరిగిపోతోంది. పొద్దున్న రావడం, మళ్లీ సాయంకాలమే తిరుగు ప్రయాణం.**

'నీకేం, ఏమైనా అనుకుంటావు. మీ రోజుల్లోలాగా. ఎన్నాళ్లైనా పుట్టిళ్లలో పడిఉండటానికి ఇప్పటి ఆడపిల్లలకు ఏమీ పనీ పాటా లేదు గనుకనా? వాళ్లకూఎన్నో బరువులు, బాధ్యతలూ!' అనుకుంది అరవింద మనసులోనే. ఈ మాటలు పైకి అనటానికి వీల్లేదు. తనంటే నిర్లక్ష్యం చేస్తున్నా ననుకుంటుంది మేనత్త.

చిన్నతనం నుంచి మేనత్త — రాజ్యలక్ష్మి దగ్గరే పెరిగింది అరవింద. అయిదో ఏట తల్లి చనిపోయింది. రెండేళ్లు తమాయించుకుని ఉండి, ఆ తరువాత చేతగాక తండ్రి మరో పెళ్లి చేసుకున్నాడు. సవతి తల్లి ముందే షరతు పెట్టింది — నీ పిల్లను నేను పెంచను గాక పెంచను అని. ఏం చేయడమా అని విచికిత్సలో పడ్డ తరుణంలో ఆయన అక్కగారు దేవతలా ఆసరా ఇచ్చింది.

"పోనీలేరా! నా దగ్గర పెరుగుతుంది అరవింద. నాకు ఎలాగూ ఆడపిల్లలు లేరు కదా! ఆ ముచ్చటా తీరుతుంది!" అనేసింది.

తండ్రికి నెత్తిమీద పాలుపోసినట్లయింది. వెంటనే నిరభ్యంతరంగా పెళ్లిపీటల మీద కూర్చున్నాడు,

మేనత్త రాజ్యలక్ష్మికి బోలెడంత ఆస్తి. అరవిందకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చదువు, పెళ్లి జరిగిపోయాయి. నిజానికి తండ్రి దగ్గరే ఉంటే ఇంత హాయిగా, రికామీగా జీవితం ఏర్పాటయ్యేదా అని అనుకుంటూ ఉంటుంది అప్పుడప్పుడూ అరవింద.

మేనత్తకు ఇద్దరు కొడుకు లున్నారు. ఒకడు అరవిందకంటె మరీ పెద్దవాడు. అందుచేత అరవింద ఆ ఇద్దరిలో ఎవరినీ చేసుకోవలసిన ప్రసక్తి లేదు. అయినా మేనత్త "నా కూతురులా పెరిగింది అరవింద. దానికి ఇష్టమైన పై సంబంధమే తీసుకువచ్చి చేస్తాను గాని, ఇంట్లో ఇంట్లోనే ముడిపెట్టను" అనేసింది. ఎవరో — "అంతగా వయోభేదం పాటించవలసిన అవసరం లేదు. పెద్దవాడికి ఇచ్చి చేసుకో, ఇద్దరూ కళ్లముందే ఉంటారు!" అని చెప్పబోయినప్పుడు —

అరవింద బి.ఏ. పాసైన తరువాత "పెళ్లి చేసుకుంటావా, పైకి చదువుతావా?" అనడిగింది మేనత్త.

"నాకు తెలియదు. నువ్వు ఏం చేయమంటే అది చేస్తాను!" అనడం తప్ప, అరవిందకు మరో సమాధానం దొరకలేదు.

"ఆలోచించుకో, తొందర లేం?" అంది మేనత్త.

ఆలోచించుకుంటూ ఉండగానే నెలలు గడిచిపోయాయి.

'పోనీ ఏదైనా ఉద్యోగం చేస్తాను' అనుకుంది — తన తోటివాళ్లు కొందరు రోజూ సుతారంగా ఆఫీసులకు పోతూ అక్కడి కబుర్లు సరదాగా చెబుతూ ఉండటం విన్నప్పుడు.

"ఉద్యోగం ఎందుకే నీకు? చదువుకోవడం ఇష్టం లేకపోతే, పెళ్లి చేసుకుని హాయిగా కాపురం చేసుకో!" అని నిరుత్సాహపరిచింది మేనత్త.

ఆమె అంటే ఎంతో ఆత్మీయత, గౌరవమూ ఉన్నా, ఎలాగైనా ఆమెవి కొన్ని పాతకాలపు ఆలోచనలు అనే అభిప్రాయం అరవిందకు కాలేజీలో చేరినప్పుడే అనిపించింది. అసలు కాలేజీలో చేరకుండా అప్పుడే పెళ్లి చేసేసినా అరవింద ఎలాంటి అభ్యంతరమూ చెప్పి ఉండేది కాదు. అత్తయ్యకు ఎందుకనో చదువుల మీద ఆపేక్ష. చేతనైనంతవరకు అందరూ చదువుకోగలిగితే గాని దేశానికి పురోగతి లేదని ఆమె అవకాశం వచ్చినప్పుడల్లా బాహాటంగా చెబుతూ ఉంటుంది.

అరవింద ఊరికే ఉండకుండా ఏదో బ్యాంక్ వాళ్లు పరీక్ష పెడితే ఒక ఆదివారంనాడు అత్తయ్యకు చెప్పీ చెప్పకుండా వెళ్లి రాసి వచ్చేసింది. ఒక నెలరోజులైనా తిరక్కుండానే వాళ్లు 'నిన్ను సెలెక్ట్ చేశాం. వారం రోజుల్లో వచ్చి చేరు. లేకపోతే ఈ ఆర్డరు కాన్సిల్ చేసేస్తాం' అన్నారు.

అప్పుడు కూడా మేనత్త ఎక్కువ అభ్యంతరం చెప్పలేదు.

"అంతగా నీవు సంబరపడుతున్నప్పుడు నే నెందుకు కాదనాలి? ఈ బులబాటం ఎన్నాళ్లో నేనూ చూస్తాను!" అని — అదో ఛాలెంజ్‌ తీసుకుని అరవింద ఉద్యోగంలో చేరడాని ఆమె అనుమతించింది.

"మరి పెళ్లి చేసుకోవా?" అనడిగింది ఆమె — ఓ ఆర్నెల్లు పోయాక. అప్పటికి ఆమెకి అరవింద ఇక పై చదువులు చదవదు అ నిర్ధారణ అయిపోయింది.


అరవింద సిగ్గుగానే, "ఏం చేసుకుంటాలే ఏం తొందర?" అంది.

"చిన్నప్పుడు — బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా అని ఓ సామె ఉండేది. ఈ రోజుల్లో అది ఆడపిల్లల క్కూడ వర్తిస్తుంది. చదువుకున్న ఆడపిల్లలు తమకంట ఎక్కువ చదువుకున్నవాడే మొగుడుగ కావాలనుకుంటారు. మంచి ఉద్యోగంల ఉన్నవాడు కావాలనుకున్నా అదీ కష్టమే అయిపోతుంది. రోజులు ఎంతగా మారిపోయ యనుకున్నా ముప్పై ఏళ్ల వరుళ్లు దొరకడ కష్టం" అంది మేనత్త.

ఆ మాటా నిజమే, అయినా చూద్దాం అ అరవింద ఉద్యోగంలో హుషారుగ పనిచేసుకుంటూ పోతోంది.

రెండేళ్లు జరిగేటప్పటికి అరవిందక ప్రమోషన్ ఇచ్చారు. ప్రమోషన్‌తోపాటు బదిల కూడా! బదిలీ అంటే ఎంతో దూరం కాదు మూడువందల కిలోమీటర్ల దూరం. అంతే!

"వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉంటాను, న కేం ఇబ్బంది లేదు. కాకపోతే నువ్వు ఒక్కదానివే ఇక్కడ ఉండిపోవాలి. పోనీ ... అరవింద సందేహం ప్రకటిస్తూ ఉండగానే మేనత్త — "కొడుకులు అమెరికా రమ్మంటే వెళ్లనిదాన్ని నీకోసం ఈ స్వంత ఇల్లు అలవాటైన వాతావరణం మార్చుకు అక్కడకు వచ్చేస్తా ననుకున్నావా? ఎం ఆశ!" అంది ఆమె. అలా అంటుందని అరవింద ఎరుగును.



అరవింద కొత్త ఊళ్లో ఉద్యోగంలో చేరింది.

అక్కడ ఆమె జీవితం ఒక మలుపు తిరిగింది.

మలుపు అంటే మ రేం లేదు. అదే బ్యాంక్ — మరో బ్రాంచ్‌లో పనిచేస్తున్న రవితో పరిచయం అయింది.

ఆ పరిచయం కాస్త ముదిరి ఇద్దరూ పెళ్లి చేసుకుందాం అనుకున్నారు.

"మీ మేనత్తగారు మన పెళ్లికి ఒప్పుకోకపోతే? అప్పుడు ఏం చేద్దాం?" అన్నాడు రవి.

"ఒప్పుకోదని మీ కెలా అనిపించింది?"

"ఆమె పాతకాలపు మనిషని మీరే అన్నారుగా!"

"పాతో, కొత్తో నాకు తెలియదు. అర్థంకాకుండా పోతోంది కూడా! ఆమె కొన్ని విషయాలలో ఎంత బి.సి.నాటి మనిషో, మరికొన్ని విషయాలలో ఎంతో ఎడ్వాన్స్‌డ్‌గా ఆలోచించగలుగుతుంది. అదే చిత్రం అనిపిస్తుంది నాకు!" అంది అరవింద.

"అయితే ఆమెగారు గురజాడవారు అన్నట్లుగా కొత్తపాతల మేలు కలయిక అన్నమాట!" అన్నాడు రవి.

అరవింద నవ్వేసి ఊరుకుంది అప్పటికి.

"అతడు నిన్ను ఉద్యోగం చేయనిస్తాడా? బాగా చూసుకుంటాడని నమ్మకం ఉందా? పైకి మంచివాడుగా కనిపిస్తున్నాడు కదా అని నీవు భ్రమిసిపోవడంలేదు కద! మనం అతని పుట్టుపూర్వోత్తరాలన్నీ విచారించాలి చాలా జాగ్రత్తగా!" అంది మేనత్త — అరవింద ఆ విషయం ఎత్తినప్పుడు.

"నీకు చేతనైనట్లు విచారించు. కాని నే నతన్ని చేసుకోవడం 'మటుకు నిశ్చయం. అయినా పెళ్లికి ముందు షరతులు, కట్టుబాట్లు, నిర్ణయాలు మాట్లాడుకోవడం ఏమిటి? ఎప్పటి కెయ్యది ప్రస్తుతమో అట్లా వ్యవహరించడమే మంచిదని నీవే చెబుతూ ఉంటావు కదా, అత్తయ్యా!" అంది అరవింద.

మేనత్త ఒకటి రెండుమార్లు రవిని ఇంటర్వ్యూ చేసింది. అరవింద తండ్రికి కబురుచేసింది కాని, ఆయన అంతగా పట్టించుకోలేదు. "అయినా రిజిస్ట్రార్ ఆఫీసులో జరిగే పెళ్లికి నా ప్రమేయం ఏముంది?" అని తప్పించుకున్నాడు.

అలా అరవింద వివాహం రవితో జరిగిపోయింది.

"నేను ఎప్పుడు కావాలనుకున్నా టెలిఫోన్లో ఒక్క ముక్క చెప్పేయ్, అత్తయ్యా! రెక్కలు కట్టుకుని నీ ముందు వాలుతాను" అంది

అరవింద. అలా అనడమే ఇప్పు డీ ప్రయాణం చేయటానికి హేతువు అయి కూర్చుంది. "కాస్త నలతగా ఉంది, ఒక్కమారు వచ్చి వెళ్లు!" అని మెసేజ్ ఇచ్చింది మేనత్త. అరవింద ఒక్కరోజు బాగ్యానికి అంత ప్రయాణమూ ఒంటరిగానే చేయవలసివచ్చింది. అంతకుముందు నెలలోనే రవితోపాటు వచ్చి వారం రోజులు ఇక్కడ తిష్ఠ వేసింది.

ఆ వారం రోజులూ మేనత్త కొత్త దంపతులకు — ఇంకా సంవత్సరం నిండలేదు — ఎన్నో కథలు చెప్పింది. జీవితాన్ని డబ్బుతో ముడిపెట్టుకోకుండా కులాసాగా గడిపివేయడం ముఖ్యం అన్న విషయం వాళ్ల మనసులకు బాగా పట్టుకునేందుకు తన జీవితంనుంచి ఎన్నో ఉదాహరణలు ఇస్తూ, సన్నివేశాలు వివరిస్తూ రకరకాల కబుర్లు చెప్పింది.

"అన్నట్లు నీ కో సంగతి చెప్పానా ఎప్పుడైనా?" అంది అకస్మాత్తుగా ఒకనాడు.

"ఎన్నో సంగతులు చెప్పావు, అత్తయ్యా! అయినా ఇప్పుడు నీవు చెప్పబోయేది సాంతం వింటేనేగాని ఇదివరకు చెప్పావో, లేదో నాకు గుర్తురాదు. అయినా రవికి ఈ కథలన్నీ కొత్తే కదా! చెప్పు, కొంత కాలక్షేపం కూడా అవుతుంది" అంది అరవింద.

రాజ్యలక్ష్మి గతంలోకి తాను వెళ్లడమే కాకుండా వాళ్లను కూడా తీసుకెళ్లింది.

* * *

టెలిఫోన్ మోగుతోంది.

రాజ్యలక్ష్మి స్నానాల గదిలో ఉంది.

వెంటనే అందుకునే పరిస్థితి కాదు.

అయినా గబగబా తయారై ఇవతలకు వచ్చింది.

అవతల మనిషి విసుగెత్తి కింద పెట్టేస్తే, తెలియవలసిన సంగతులు తెలియకుండా పోతాయి. ఒక్కోమారు అంత ప్రమాదకరం కాకపోవచ్చు. ఎందుచేతనంటే సాధారణంగా దీన్లో దొరికేవి 'రాంగ్ నంబర్లే!'.

"హలో!" అంది రాజ్యలక్ష్మి ఏమాత్రం తొందరపాటు గొంతులో కనిపించనీయకుండా.

"రామచంద్రరావుగారి ఇల్లేనాండీ?" అన్నది అవతలి గొంతు.


"అవును. ఆయన ఇంట్లో లేరు. ఎవరు మాట్లాడుతున్నది?"

"అలాగాండీ! మిసెస్ రామచంద్రరావుగారితో మాట్లాడాలండీ. మేం అనూరాధ సిల్క్స్ నుంచి మాట్లాడుతున్నాం" అన్నాడు అవతలిగొంతు.

"మిసెస్ రాజ్యలక్ష్మి రామచంద్రరావునే మాట్లాడుతున్నాను. ఏం కావాలి?"

"అమ్మగారేనా! నమస్కారం!" అన్నాడు అవతలి వ్యక్తి తరువాత తడుముకోకుండా విషయమంతా ఏకబిగిని చెప్పివేశాడు.

రాజ్యలక్ష్మి 'ఆఁ, ఊఁ' అనకుండా వింటూ ఉండిపోయింది. కాసేపు అర్థం కాకుండా, కాసేపు నమ్మటానికి వీల్లేకుండా ఉంది అతవలి నుంచి వింటున్న విషయం.




చెప్పడమంతా అయిపోయిన తర్వాత అవతలిగొంతు "ఇక ఉంటానండీ! సెలవు. తమరు ఎప్పుడు వీలైతే అప్పుడు దయచేయండి. మీ ఇష్టం. వచ్చేటప్పుడు మాత్రం ఆ రసీదు తీసుకురండి!" అని ఆగిపోయింది.

రిసీవర్ క్రెడిల్ చేసి రాజ్యలక్ష్మి సోఫాలో కూలబడిపోయింది. మనసంతా కలయదీసుకుని గుర్తుచేసుకోవడానికి ప్రయత్నించింది.

ఎప్పుడో రెండు నెలల కిందటి సమాచారం.

అప్పుడు అంత ప్రధానంగా తీసుకోలేదు.

ఆ రసీదైనా ఎక్కడుందో వెదకాలి ఇప్పుడు.

ఎక్కడో ఉండే ఉంటుంది. తనకు గానీ, ఆయనకు గానీ రసీదులు చింపిపారవేసే అలవాటు లేదు. ఎవరికో చూపించాలన్నంత భద్రంగా ఎవరో 'రీయంబర్స్' చేస్తారన్న ధోరణిలో అన్నిటినీ బహు జాగ్రత్తగా దాచి ఉంచుతారు. ఆఖరుకు గ్యాస్ సిలెండర్ పింక్ రసీదులు కూడా. కాకపోతే కాస్త ఓపిక చేసుకుని వెదకాలి. అంతే!

రెండు నెలల క్రితం సునీత వచ్చింది తనను చూడటానికి. ఎప్పుడో బి.ఏ. క్లాసులో 'సహకర్మచారిణి' సునీత ఈ ముప్పై ఏళ్లలోనూ నాలుగైదు మార్లయినా వచ్చి ఉంటుంది. కానీ ఆత్మీయంగా, ఆంతరికంగా మాట్లాడగల స్నేహితురాలు సునీత ఒక్కత్తే.

ఆ ఉన్న నాలుగైదు రోజుల్లోనే సునీత పుట్టినరోజు అయినట్లు మాటల సందర్భంలో తెలిసింది.

"ఆఁ, ఏమిటో ఈ పుట్టిన రోజులు ప్రతి సంవత్సరమూ విడవకుండా వచ్చేస్తాయి. ఒకయేటికి ఒకయేడు మనం తిరుగు ప్రయాణానికి దగ్గర అయిపోతున్నామని గుర్తు చేస్తూ ..." అంది సునీత — జీవితంలో వేదాంతం మిళాయింపు చేస్తూ.

"రోజులు ఇట్టే గడిచిపోతాయి!" అంది రాజ్యలక్ష్మి.

తరువాత ఇద్దరూ ఈ ముప్పై ఏళ్లలోనూ జీవితంలో వచ్చిన మార్పులు, చేర్పులు, అనుభవాలు నేర్పిన పాఠాలు వీటిని గురించి వల్లె వేసుకున్నారు.

ఆ మధ్యాహ్నం సునీతకు తెలియకుండా బజారుకు వెళ్లింది రాజ్యలక్ష్మి.

పుట్టినరోజుకు ఏదైనా ప్రత్యేక బహుమతి ఇచ్చి స్నేహితురాలిని సర్‌ప్రైజ్ చేయాలని ఆమె ఉద్దేశ్యం.

"ఏం ఇద్దామంటారు?" అనడిగింది భర్తను.

"ఓ పట్టుచీర కొనిపెట్టు. మీ ఆడవాళ్లకు అంతకంటే ఆనందదాయకం అయిన విషయం ఇం కేముంటుంది?" అన్నాడు ఆయన.

ఎంత నేర్చినా, ఎంత చూచినా వనిత లందరూ నగలకు, చీరలకు దాసులేనని ఆయన నిశ్చిత అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని కాదనడానికి రాజ్యలక్ష్మికి ఏమీ ప్రత్యేకమైన కారణాలు లేవు. అలాగే సని చెప్పి అనూరాధ సిల్క్స్‌లో ఆరువందల రూపాయల పట్టుచీర కొన్నది స్నేహితురాలి కోసం.

మెడలో కర్పూరమాల వేసి, చేతికి రంగురంగుల పుష్పగుచ్ఛం అందించి ఒడిలో పట్టుచీర పెట్టినప్పుడు సునీత ముఖంలో వేయి పున్నముల వెన్నెల అగుపించింది. "ఎందుకు ఇంత ఆర్భాటం, రాజ్యం?" అన్నది అంత సంతోషంలోనూ గొంతు పెగుల్చుకుని.

"ఎందు కేమిటి? ఉన్నన్నాళ్లూ ఉన్నంతలో కులాసాగా, విలాసంగా ఉండటమే కదూ జీవిత తత్వం!" అంది రాజ్యలక్ష్మి.

ఇంతకూ జరిగిన విషయం ఏమిటంటే, ఆ చీర కొంటున్నప్పుడు షాపు యజమాని

ఆమెతో అన్నాడు — "అమ్మా! రసీదు పారవేయకుండా జాగ్రత్తగా ఉంచండి. మేం ఏభై ఏళ్లుగా ఈ వ్యాపారంలో ఉన్నాం. కోట్లు సంపాదించాం. మా సంతోషాన్ని ఖాతాదారులతో పంచుకోవటానికి ఈ సంవత్సరం ఓ కొత్త స్కీం ప్రారంభించాం. ప్రతి నెలా రెండు బహుమతులు ఇస్తున్నాం. ఏభై వేలు, పది వేలు. మా సంతోషాన్ని ఇతరులతో పంచుకోవడంలో మాకు సహాయపడండి!"

"ఎలా నిర్ణయిస్తారు బహుమతులు?" అనడిగింది రాజ్యలక్ష్మి.

"అయిదు వందల రూపాయలు పైబడిన బిల్లులన్నీ ఒక గుంపు, అయిదు వందల లోపువన్నీ మరో గుంపు. ప్రతి నెలా ఒక్కో గుంపులో నుంచి రసీదు ఎన్నుకుంటాం.

ఎన్నుకుంటాం అంటే మా ఇష్టం వచ్చిన వాళ్లకు ఇస్తామని కాదు. పురప్రముఖుల సమక్షంలో యంత్రం మీద ఎన్నుకుంటాం. అంతా ఆ యంత్రం దయ. అది చెప్పిన కొనుగోలుదారులకు ఏభైవేలు, పది వేలు ఇస్తాం ఇద్దరికి — ఆ గుంపునుబట్టి."

రా' జలక్ష్మి అనాసక్తంగా విన్నది.

అమ్మకాలు ఎక్కువ చేసుకోవటానికి ఇ దో సులభమార్గం.

రామచంద్రరావు అన్నాడు — "మనిషిలో అనాయాసంగా డబ్బు సంపాదించుకోవాలన్న అభిప్రాయాలు ఉన్నవాళ్లు ఎక్కువవుతున్న కొద్దీ ఎన్ని రకాల లాటరీలైనా చెలామణీ అయిపోతాయి."

"సరేలెండి! వాళ్లు ఎవరికో ఒకరికి ఆ ఏభై, పదివేలు ఇస్తున్నంతకాలం ఇందులో మోసం ఏమీ లేదుగా!" అంది రాజ్యలక్ష్మి.

"మోసమా, మోసం కాదా అన్నది కాదు ప్రశ్న. మనిషి చిత్తవృత్తులతో, వికారాలతో ఆటలాడ్డం' ఇది! అంతా ఈశ్వర లీల!" అన్నాడు రామచంద్రరావు.

ఆ సంగతి అప్పటితో మరచిపోయారు.

స్నేహితురాలికి కానుకగా కొన్న చీర రసీదు మీద యాభై వేల రూపాయలు బహుమతి వస్తుందని గాని, రావాలని గాని రాజ్యలక్ష్మికి మనసులో ఆలోచనే లేదు.

మిగిలిపోయిన ఇంటిపనుల్లో జొరబడింది. ఆయన రాగానే ఈ సంగతంతా చెప్పాలి; ఎట్లా స్పందిస్తారో చూడాలి — అనుకుంది.

'యాభైవేలు తీసుకోవద్దు!' అంటారా?

తీసుకుని ఏం చేయమంటారు?

'నువ్వు కొనుక్కున్న చీర మీద వచ్చిన బహుమతి ఇది. ఈ డబ్బు నీదే. నీ ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేసుకో!' అంటారా?

యాభైవేలు ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసుకుంటే, ప్రతి నెలా మరో అయిదువందలు అదనపు ఆదాయం. జీవితం మరింత విలాసంగా గడుపుకోవచ్చు. రోజురోజుకూ పెరిగిపోతున్న ధరలతో పోటీ పడటం, ఖర్చులు తగ్గించుకోవలసి రావడం లేకుండా కాలక్షేపం చేసుకోవచ్చు.

'జీవితంలో అనేక కష్టాలు పడ్డాం. చదువులు, ఉద్యోగాలు, సంసారం, పిల్లలు, పిల్లల చదువులు, ఉద్యోగాలు, వాళ్లకు సంసారం ఏర్పాటు చేయడం — ఇలా వలయంగా పనులన్నీ పరిభ్రమిస్తూనే ఉన్నాయి. ఇప్పుడిది సమయం. హాయిగా ఏ చీకూచింతా మనసుకు అంటుకోకుండా కాలం గడిపివేయవలసిన సమయం. ఇంతకంటె కావలసింది, కోరుకోవలసింది ఏమీ లేదు' అంటాడు రామచంద్రరావు అతి తరచుగా.

సుఖ సంసారానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకున్నారు.

దేశంలో నాలుగైదు ప్రదేశాలలో ఎన్నుకోవడం, పని తొందరలు వెంట తరుముతూ ఉన్నప్పుడు ఉండిన హడావుడి లేకుండా తాపీగా, తీరుబడిగా ఆ ప్రదేశాలు పరికించిరావడం మనసుకు కొత్త ఆనందం తీసుకువస్తుంది. దేశంతో మనం కలిసిపోవటానికి వీలు కలగజేస్తుంది. ఆయన అంగీకరిస్తే ఈ ఆలోచన అమలు చేయాలని ఉంది రాజ్యలక్ష్మికి.

ఆయన వచ్చిన తరువాత ఈ ప్రసక్తి తీసుకురావాలి.

తీర్థ యాత్రలు చేయాలని లేదు తనకు. అదనంగా కొంత డబ్బు సమకూడుతోంది గనుక దానితో మరో సౌకర్యం ఏర్పరచుకోవడం — అంతే!

రామచంద్రరావు ఇంటికి రావడంతోటే ఈ సంగతి చెప్పలేదు ఆమె.

భోజనాలు అయ్యాయి.

ఇద్దరూ నిద్రపోయారు.

నాలుగు గంటల ప్రాంతంలో లేచారు.

టీ కలిపింది రాజ్యలక్ష్మి.

"సాయంత్రం ఏమైనా పని ఉన్నదా ప్రత్యేకంగా?" అని అడిగింది.

"పనేమీ లేదు. మామూలే. క్లబ్‌కు వెళ్లడం. ఇవాళ ఓ ఇంటెరెస్టింగ్ డిస్కషన్ ఉంది" అన్నాడు.

"మనం బజారుకు పోవాలి, మీ క్లబ్ మీటింగ్ అయిన తర్వాత."

"ఏమిటట సంగతి?"

అప్పుడు చెప్పింది రాజ్యలక్ష్మి — యాభై వేల రూపాయలకు ఒక చెక్కు తన పేర సిద్ధంగా ఉన్నదనీ, దాన్ని కలెక్ట్ చేసుకువస్తే సరిపోతుందనీ.

"కంగ్రాట్యులేషన్స్!" అన్నాడు రామచంద్రరావు.

"థాంక్స్!" అంది రాజ్యలక్ష్మి. వెంటనే "ఏం చేయమంటారు ఈ డబ్బు?" అనడిగింది.

"డబ్బు కేం? ఏమైనా చేయవచ్చు. నీ ఇష్టం."

"నా ఇష్టమే ననుకోండి. అయినా మీ సలహా ఏమిటి?"

"న న్నడిగితే, సునీతకు చీర కొనడం వల్ల వచ్చింది గనుక, ఈ డబ్బు కూడా ఆమెకే ఇచ్చేయమంటాను!" అన్నాడు రామచంద్రరావు.

ఈ ఆలోచన తనకే ఎందుకు స్ఫురించలేదో అర్థం కాలేదు రాజ్యలక్ష్మికి. చాలా తార్కికంగా ఉంది.

అయినా సునీతకు ఇవ్వడం ఏమిటి?

అర్థం లేని మాట!


"నాకు ఇష్టం లేదు. మనమే ఉపయోగించుకుందాం!" అంది.

ఒక్క నిముషం ఆగి, "అబ్బాయిలకు ఇద్దాం!" అంది.

"వాళ్లకు అవసరం లేదు. ఎందుకు వాళ్లను పాడుచేయడం?"

"మన అవసరాలన్నీ తీరిపోయాక, మన కేమీ ఆలోచనలు లేనప్పుడు ఇప్పుడు ఎందుకు వచ్చిం దండీ ఈ డబ్బు?"

"డబ్బు లక్షణమే అటువంటిది. మనకు అవసరం అయినప్పుడు అందలం ఎక్కుతుంది. అక్కర్లేదు అనుకున్నప్పుడు అలమురలనిండా పెరుకుంటుంది!" అంటూ రామచంద్రరావు ఆలోచనల్లో



ఖనిగిపోయాడు.

కొద్ది క్షణాల విరామం తరువాత అన్నాడు — నీకు గుర్తుందా, రాజ్యలక్ష్మీ! పెద్ద అబ్బాయి విదేశాలకు వెళ్లవలసినప్పుడు సరిగ్గా ఏభై వేలు తక్కువపడింది — మన దగ్గర డబ్బు. ఏదో అవస్థ పడి సంపాదించి గండం గట్టెక్కించామనుకో. ఆ యాభై వేలు ఇప్పుడు వచ్చిందేమో!"

"అలా చూసుకుంటే — యాభై వేలు తక్కువ పడిన సందర్భాలు ఇంకా చాలానే ఉన్నాయికదండీ!"

"అవును సుమా!" అని రామచంద్రరావు మరో రెండు మూడు గత స్మృతులు బయటపెట్టాడు. "చెప్పులు తొడుక్కున్నవాడికే అవి ఎక్కడ కరుస్తున్నాయో తెలుస్తుంది. ఇప్పు డవన్నీ ఎందుకులే మళ్లీ అనుకోవడం?" అన్నాడు.

"అందుకనే పిల్లలకు ఇద్దామనుకుంటున్నాను. వాళ్లను ఏమైనా చేసుకోనీండి!" అంది రాజ్యలక్ష్మి.

"వాళ్ల అవసరాలు గడిపాం. ఏమీ బాకీ పెట్టలేదు."

ఇక రెట్టించదలుచుకోలేదు రాజ్యలక్ష్మి.

మరో రెండు నిముషాలు గడిచిన తర్వాత తన మనసులో మాట బయటపెట్టింది. "పోనీ — దేశం అంతా ఒకమారు చూచివద్దామా? మన మిద్దరమూ మలేసియా లాంటి దగ్గర దేశాలు చూసిరాకూడదూ?"

"ఉత్తర దక్షిణ దేశయాత్రలా? ఎందుకు వచ్చిన ఆయాసం? ఇప్పుడే ఇక్కడే మోక్షం! దానికోసం తీర్థయాత్రలు చేయవలసిన పని లేదు. దండగమారి పని!"

"సరే, ఏం చేద్దాం అన్నది తరువాత చూచుకోవచ్చు. ముందు ఆ చెక్ వసూలు చేసుకుంటే మంచిది కదూ!" అంది రాజ్యలక్ష్మి.

"అలాగే చేద్దాం!"

ఆ సాయంత్రం ఇద్దరూ క్లబ్‌కు వెళ్లారు.

క్లబ్‌లో చర్చా కార్యక్రమం ప్రారంభమైంది.

ప్రధానంగా పాల్గొన్న వ్యక్తి చాలా ఉద్రేకంగా మాట్లాడాడు.

"దేశంలో నానాటికీ మంచితనం, హుందాతనం తరిగిపోతున్నాయి. మనుషుల్లో స్వార్థపరత్వం ఎక్కువైపోతోంది.

"ప్రతి పనీఎవరో చేయాలి; ప్రభుత్వమే గ్రాంట్స్ ఇవ్వాలి — అని ఎదురుచూస్తారే తప్ప ఎవరూ తమంత తాము సమయాన్ని, సంవిధానాన్ని ఖర్చు చేయటానికి ముందుకు రారు!" అన్నాడు ఆ వక్త.

ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించడంలో ప్రభుత్వపు గ్రాంట్లు చాలా భాగం ఎలా దుర్వినియోగం అయిపోతున్నాయో చర్చ జరిగింది కొద్దిసేపు.

కొన్ని స్వచ్ఛంద సంస్థలు నిస్వార్థంగా పనిచేసి సామాన్య జీవనానికి మరింత సుఖకరం, సుగమం చేయటానికి ప్రయత్నిస్తున్నాయన్న ప్రస్తావన కూడా వచ్చింది.

"ఎవరో, ఏదో చేయలేదని కాదు మనం ఆలోచించవలసింది. ఎవరికి వారం — ఎంతవరకు సమంజసంగా ప్రవర్తిస్తున్నాం అనేది చూసుకోవాలి. నిష్పక్షపాతంగా మన చర్యల్ని మనం విమర్శించుకోగలగాలి!" అని అధ్యక్షుడు ముక్తాయింపు చేశాడు.

క్లబ్ నుంచి బయలుదేరి సిల్క్ హౌస్‌కు వెడుతున్న దారిలో రాజ్యలక్ష్మి నిదానంగా అంది — "ఏవండీ! ఆ మూగ, చెవిటి వాళ్ల కోసం పనిచేసే సంస్థకు విరాళంగా ఇచ్చేద్దామండీ ఈ యాభైవేలూను. పాపం, ఆ పిల్లలకు తమ బాధలు ప్రపంచంతో చెప్పుకునేందుకు నోరు, వాయి లేదు కదా!"

"చాలా మంచి నిర్ణయం!" అన్నాడు రామచంద్రరావు.

"అంతేనండి! ఆ విరాళం కూడా ఏమాత్రం అట్టహాసం, ఆడంబరం లేకుండా ఇచ్చేద్దాం. ఇచ్చేవాళ్లు, పుచ్చుకునేవాళ్లు తప్ప మూడో కంటివాడికి తెలియ నవసరం లేదు!" అంది.



## బాలీవుడ్ బాణీ

### దుస్తులలో పోటీ

*మిథున్ చక్రవర్తి, గోవింద ఒకే ఒక విషయంలో చాలా తీవ్రంగా పోటీపడుతున్నారు. ఇంతకూ ఆ విషయం ఏమిటో తెలుసా? ఎవరు చెత్త డ్రెస్సు వేసుకుంటారనే అంశంలో. ఎందుకో కాని ఈ మధ్య చిత్రాలలో వాళ్లు ఇద్దరూ పోటీపడి జనం భయపడే రంగుల డ్రెస్సులు వేసుకుంటున్నారు. పులిచారల రంగు లున్న ప్యాంట్లు, పచ్చ చొక్కాలతో మిథున్ భయపెడుతుంటే, గోవింద నారింజ, ఊదా రంగుల గమ్మత్తు కాంబినేషన్ డ్రెస్సులు వేసుకుంటున్నాడు. ప్రేక్షకులపై ఈ హీరో లిద్దరికీ అంత పగెందుకో?*

మసూద్ అన్సారి

"ఆ మూడో కంటివాడికి అన్ని సంగతులూ ముందే తెలుసు!" అన్నాడు రామచంద్రరావు — ఇంతకంటె అభినందించడం ఎలాగో తెలియక.

* * *

"అయితే మీరు తరువాత ఎప్పుడూ ఆ ఏభైవేలు అలా యథాలాపంగా దానం చేసేసినందుకు విచారించలేదా? నేను అడుగుతున్నా నని కోపగించుకోకండి. ఆ రోజుల్లో — ఆ మాటకు వస్తే, ఇప్పుడు కూడా ఏభై వేలు తక్కువ సొమ్మేం కాదు!" అన్నాడు రవి.

"ఆ సంగతే మరిచిపోయాం. ఆ సంస్థ నుంచి ఏదైనా ఆహ్వానం వచ్చినప్పుడే ఆ విషయం ఒక్క క్షణం మనసులో మెదిలేది. నిన్ననే ఏదో ఉత్సవ మంటూ ఆహ్వానపత్రిక వచ్చింది. అందుకే ఈ కథంతా మీకు చెప్పాను!" అంది మేనత్త రాజ్యలక్ష్మి.

"ఎవరికి ఏది యోగం ఉంటే అదే జరుగుతుంది అంటావు కదా అత్తా?" అంది అరవింద.

"అవును. ఆ యోగం ఏమిటో ఎవరికి వారు కనుక్కోవడంలోనే జీవిత ప్రయోగం అంతా ఇమిడి ఉంది!" అంది రాజ్యలక్ష్మి బహు నిదానంగా.

* * *

అత్తయ్యకు పెద్దగా సలపర మేమీ లేదు.

అరవింద వెళ్లేసరికి ఉన్న బద్ధకం కాస్తా తీరిపోయి హాయిగా పిండివంటలు తయారుచేయించడంలో మునిగిపోయి ఉంది.

అరవిందకు బ్యాంక్ మేనేజర్ చెప్పాడు — "మీరు అంతగా చెబుతున్నారు గనుక ఒక్క రోజుకు ఒప్పుకుంటున్నాను. రేపు లేదు, ఎల్లుండి ఉదయం మీరు డ్యూటీలో చేరి తీరాలి. బ్యాంక్‌కు ఎగనామం పెట్టారంటే ఎంతమాత్రం ఊరుకోను. కొత్తగా ప్రమోషన్ పొందినవాళ్లు చాలా జాగ్రత్తగా ఉండాలి సర్వీస్‌లో!" అని.

ఒక్క రోజే మహాభాగ్యంగా మేనత్తను చూసి వెళ్తోంది అరవింద. తన ఉద్యోగం సంగతే కాకుండా రవికి ఇబ్బంది అవుతుందని అరవిందకు ఏ మూలో మనసులో శంక ఉంది. అతనికి వంట చేసుకోవడం రాదు, హోటల్లో బాగా తినడమూ చేతకాదు.

అందుకనే వచ్చినంత వేగంగానూ తిరిగి వెళ్లిపోతోంది.

టిక్కెట్ కూడా ఆఖరు క్షణంలో కొనుక్కుని, బెర్త్ నంబర్ ఎలాట్ చేయించుకున్నందువల్ల ప్రయాణం కష్టమైపోతుందేమో నన్న టెన్షన్ తగ్గిపోయి ఇప్పుడిప్పుడే స్తిమితపడుతోంది.

తనకు ఎదురుగా ఇంకో అమ్మాయి కూర్చుని ఉండటం గమనించింది. ఆమెవైపు చూసినప్పుడు ఆ అమ్మాయి పలుకరింపుగా

నవ్వింది. అరవిందకూ నవ్వక తప్పలేదు. రైల్లో కొత్త పరిచయాలు చేసుకోవడం అరవిందకు అంతగా అభిరుచిదాయకం కాదు. కాని ఆ అమ్మాయే చొరవగా పలుకరించడం వల్ల తప్పకుండా వచ్చింది.

ఆ అమ్మాయి తనకన్నా అయిదారేళ్లు చిన్నదై ఉంటుందని అంచనా వేసుకుంది అరవింద.

"నా పేరు శ్యామలండీ! ఆ ఊళ్లో అర్జెంట్ పని ఉండి వెడుతున్నాను!" అంది.

ఏమిటో అంత అర్జెంట్ పని అని అడగలేదు అరవింద. ఎవరి పనులు వాళ్లకు యమ అర్జెంట్, యమర్జంటూనూ! మనం కాదంటే మటుకు వాళ్లు మానుకుంటారా? అసలు పనిలేని వాళ్లందరూ ప్రయాణాలు చేయడం వల్లనే రైళ్లలోనూ, బస్సుల్లోనూ ఇంత రద్దీ!

ఆ అర్జెంట్ పని ఏమిటో ఆ అమ్మాయే చెప్పింది ఓ అరగంట అయిన మీదట.

ఫలానా బ్యాంక్‌లో పనిచేస్తున్న 'రవి' అనే అతనితో శ్యామలకు సంవత్సరన్నర నుంచి పరిచయం ఉందట. రవి ఆమెను పెళ్లి చేసుకుంటా నని ప్రామిస్ కూడా చేశాడట. కాని ఇన్నాళ్లు అయినా అయిపూ, ఆనవాలూ లేకుండా ఉండిపోయాడు. అతన్ని ముఖాముఖీ కలుసుకుని ఏ ముక్కా తేల్చివేసుకోవాలని బయలుదేరింది శ్యామల.

ఆ అమ్మాయి — శ్యామల చెప్పిన బ్యాంక్ తను, రవి పనిచేస్తున్నదే.

అరవింద అరికాళ్లకింద ఎవరో మంటలు పెట్టినట్లుగా అయింది. ఎవరో ఏమిటి — ఎదురుగుండా ఉన్న ఈ అమ్మాయే! కానీ, తన ఆదుర్దా, గందరగోళం శ్యామలకు కనబరచకుండా ఆమె చెబుతున్న కబుర్లన్నీ వింటూ కూర్చుంది.

"నా కెందుకో మిమ్మల్ని చూస్తుంటే ఆత్మీయత ఏర్పడుతోంది. ఏమిటీ ఈ అమ్మాయి ముఖపరిచయమైనా లేకుండానే తన ప్రేమ కబుర్లన్నీ చెబుతోం దేం అని మీకు చికాకు అనిపిస్తోందో ఏమో నాకు తెలియదు. రవి నాకు అన్యాయం చేస్తాడని నేను ఒక్కనాటికీ అనుకోను. ఏదో ఇబ్బంది వచ్చి కనిపించకుండా మానేసి ఉంటాడు. అంతే! అందుకనే అక్కడకు వెళ్తే అన్ని సంగతులు తేలుతాయి గదా అని బయలుదేరాను. నాది సాహసం అంటారా? నా జీవితం నట్టేటిపాలు అవుతుం దంటారా?" అంటూ కళ్లనీళ్లు ధారాపాతంగా వస్తుంటే ఆపుకోవడం కోసం యమ యాతన పడుతోంది.

ఈ అమ్మాయికి ఏం జవాబు చెప్పాలి?

అసలు జవాబు చెప్పాలా? జవాబు కోసం కాదు, తన మనసులో ఉన్న దుగ్ధ అంతా వెళ్లగక్కుతోంది. అంతే! అనుకుంది అరవింద.

కాని ఆ మాటలు విన్నకొద్దీ అరవింద మనస్సు మనసులో లేకుండా పోయింది.

మేనత్త చెప్పిన మాట వినకపోవడం తన తప్పిదం అవుతుందా?

రవిని గురించి పూర్తి వివరాలు సేకరించకపోవడం తన కాపురానికే ఎసరు తెస్తుందా? ధైర్యంగా సాహసంగా తాను చేసిన పని అంతా తప్పుదారిన నడిచినట్లు అయిపోతుందా?

రవి ఈమెకు ఇంత భరోసా ఇచ్చాడంటే గుండెలు తీసిన బంటు అన్నమాట!

'డబ్బయినా, మనుషులైనా వేళ్ల సందుల్లోంచి అవలీలగా తప్పించుకుపోయేందుకు అవకాశం ఉన్నది. ఆ పని బహు తేలిక. అలా జారిపోయినట్లు మనకు తెలిసే లోపలే అంతా అయిపోతుంది' అని సోక్రటీస్ ఎప్పుడో చెప్పిన వాక్యాలు మనసులో మెదిలాయి అరవిందకు.

తన ఉద్యోగం, ఆస్తి, అంతస్తు అన్నీ చూసి పెళ్లి అనే ఎర వేసి లొంగదీసుకున్నాడా తనను? కొన్నాళ్లు పోయాక తనను వదిలించుకునే ప్రయత్నం చేస్తాడుగావును! పత్రికల వార్తల్లో ఇలాంటి ఉదంతాలు ఎన్నో చూస్తూనే ఉన్నాం రోజూ! ఆఖరుకు తన జీవితం ఎందుకూ కాకుండా పరిసమాప్తి అయిపోతుందా?

అరవిందకు ఆ ఆలోచనతో ఒళ్లంతా వణికిపోవడం మొదలైంది. మనసు గతి తప్పింది. హృదయం రెండు చెక్కలుగా చీలినట్లు అయింది.

శ్యామల — "నా స్వంత గోడు చెప్పి మిమ్మల్ని విసిగిస్తున్నా ననుకుంటాను. ఎందుకోనండీ, మిమ్మల్ని చూస్తుంటే నా కో అక్క ఉంటే అచ్చం మీలాగే ఉంటుంది కదా అనిపిస్తోంది!" అంది.

అరవిందకు తన పని అయిపోయినట్లే అనిపించింది.

"నాకు నిద్ర ముంచుకు వస్తోందండీ! ఇక పడుకుంటాను. తెల్లవారాక మాత్రం లేపం దేం?" అంటూనే శ్యామల నిద్రలో కూరుకుపోయింది — ఏమీ విచారం లేనిదాని మాదిరిగా.

'అవును, ఆమె కేం చింత! అంతా నాకు బదిలీ చేసిందిగా!' అనుకుంది అరవింద. ఆ రాత్రంతా ఒంటిమీద కునుకు లేకుండా యమ యాతన పడుతూ గడిపేసింది.

తెల్లవారిన తరువాత అరవింద లేపనక్కర్లేకుండానే శ్యామల లేచి కూర్చుంది. "గుడ్ మార్నింగ్ సిస్టర్!" అంది ముఖమంతా ఆనందం పులుముకుపోయి. 'నా కీ రోజు గుడ్ మార్నింగేనా' అని ఆలోచనలో పడిపోయింది అరవింద. ఆమెకు శుభోదయం చెప్పలేకపోయింది.

"ఏమిటి అలా అలిసిపోయినట్లున్నారు? రాత్రి నిద్ర పట్టలేదా? నేనైతే రాక్షసిలాగా బండనిద్రపోయాను!" అంది శ్యామల.

'అవును. నువ్వు రాక్షసివే!' అనుకుంది అరవింద.

## అనుమానమా

"అయ్యా! మీ బట్టతలకు మందు నిజంగా పనిచేస్తుందంటారా?"

"అనుమానం ఎందుకూ? ఈ మధ్యే పూర్తిగా జుట్టూడిన బట్టత లాయ నొకాయన ఈ మందు వాడి 20 రోజుల తరువాత అందిన మా బిల్లు చూసి కొత్త జుట్టును ఆ పళాన పీకేసుకున్నాడు."

"ఏమండీ! నా దగ్గర రవి బ్యాంక్ అడ్రస్ ఉంది. ఇంటి గుర్తులు తెలియదు. పది గంటలకు గాని బ్యాంక్ ఓపెన్ చేయరు కదా! అంతదాకా ఈ స్టేషన్‌లోనే వెయిటింగ్ రూమ్‌లో కాలక్షేపం చేస్తాను!" అంది శ్యామల రైలు దిగిన తర్వాత.

అరవింద మనసు చురుగ్గా పనిచేసింది అంత చిరాకులోనూ. "అక్కర్లేదమ్మా! నాకు రవి ఇల్లు తెలుసు నిన్ను అక్కడే దింపుతాను! నాతో రా!" అని శ్యామలను తనతోపాటు ఆటో రిక్షాలో కూలేసుకుంది.

ఇంటిముందు దిగి డోర్ బెల్ నొక్కింది.

తక్షణమే రవి తలుపు తీశాడు.

"వచ్చావా, రా! ఇవాళ కూడా పస్తేనేమో నని పస్తాయిస్తున్నాను. థాంక్స్! మీ మేనత్తగారు కులాసాయేనా?" అన్నాడు రవి — ఆమెను చూడగానే. అరవింద వెనకాల నిలబడి ఉన్న శ్యామలను అతను గమనించనేలేదు.

"గొప్ప ప్రయత్నం చేసి కాఫీ తయారుచేశాను. కూర్చో, పట్టుకువస్తాను!" అని రవి హడావుడిగా ఇంట్లోకి వెళ్లిపోయాడు.

అరవింద సోఫాలో కూలబడి శ్యామలను కూడా కూర్చోమని సైగ చేసింది. ఒక్క క్షణంలోనే — "రవిని చూశావుగా! పలుకరించ వేం?" అనడిగింది.

"రవా? ఇతనా? ఇతను రవి కాడు!" అంది శ్యామల.

"చూసి సంవత్సరం అయిందన్నావు:! మరచిపోయావేమో, నిదానంగా చూడు!" అంది అరవింద అతి నిదానంగా మాట్లాడుతూ.

రవి రెండు కాఫీ గ్లాసులతో వచ్చాడు.

"ఏమండీ! ఈ అమ్మాయికి కూడా కాఫీ ఇవ్వండి. ఈ అమ్మాయి మీకు తెలుసు కదూ!" అంది తన గ్లాసు అందుకుంటూనే.

'ఎవరు?' అన్నట్లు: చూశాడు రవి.

అతని ముఖంలో 'ఈ అమ్మాయి ఎవరో నాకు తెలియదు' అన్న భావం స్పష్టంగా కనిపించింది అరవిందకు.

ఆమె మనసంతా మంచులా విడిపోయింది.

రాత్రంతా సరైన నిద్ర లేదు. అప్పుడు పరాకైన నిద్ర ఆమెను ఆవహించటానికి సైబడుతూండగా, తప్పనిసరిగా ఆఫీసుకు వెళ్లవలసి ఉందని గుర్తుకువచ్చింది అరవిందకు.